# 5. ఆచారాలు-సంస్కరణలు

## 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. ఆచారాల స్వరూప స్వభావాలను తెలిపి, భారతదేశంలో జరిగిన సంస్కరణోద్యమాలను వివరించండి.**

జ. **ఆచారాల స్వరూప స్వభావాలు :**

'ఆచారము' అంటే ఒక సంఘంలోని సభ్యుల్లో, సాంప్రదాయికంగా ఉన్న ప్రామాణికమైన ప్రవర్తనా పద్ధతి. 'ఆచారము' అనేది, ఒక చర్యకు సంబంధించిన నియమం కాని, నిబంధన కాని ఔతుంది. నిషేధమే ఆచారానికి మూలం. ఆచారం మానవజాతి యొక్క ప్రాచీనమైన వ్రాయబడని ధర్మశాస్త్రం.

**ఆచారాల, అలవాట్ల స్వభావాలు :**

1) ఒక వ్యక్తి, ఒక పనిని నిత్యమూ చేస్తే అది అలవాటు. అదే జాతి పరంగానో, సంఘపరంగానో చేస్తే అది "ఆచారము" ఔతుంది. అలవాట్లు, ఒక మనిషికీ మరో మనిషికీ, తేడాగా ఉండవచ్చు. కాని ఆచారాలు, దేశానికీ, జాతికీ మొత్తంగా చెందుతాయి.

2) ఏవి అందరికీ మేలును చేకూరుస్తాయో, ఏవి సంఘం అభివృద్ధికి సాయం చేస్తాయో, వాటినే ఆచారాలు అంటారు.

3) ఒక దేశానికి కానీ, ఒక వర్గానికి కానీ సహజమైన ఆచారం, మరో దేశానికి కానీ, వర్గానికి కానీ, విడ్డూరంగా కనిపించవచ్చు.

4) ఆచారం, సంప్రదాయం, విశ్వాసం అన్నవి ఒకటికావు ! ఆచారం ప్రధానంగా ఆచరణకు సంబంధించినది.

ఈ ఆచారాలు, జాతి జీవన విధానాన్ని వెల్లడిస్తూ ఆ జాతిని నైతిక పతనం నుండి కాపాడవచ్చు. కాని ఆచారాలు, ఆ జాతి ఆర్థిక సాంఘిక విప్లవంలో భాగం కాలేవు.

ఈ ఆచారాలు, సాంస్కృతిక జీవితంలో ప్రధాన పాత్ర వహించాయి. కాని అవి క్రమంగా తమ అంతశక్తిని కోల్పోయి చెడు ఫలితాలకు దారి తీశాయి.

ఒకనాడు బాల్యవివాహాలు ఆచారంగా ఉండేవి. తరువాతి కాలంలో అవి కన్యాశుల్కం, బాల వితంతువులు వంటి దురాచారాలకు దారి తీశాయి. వివాహంలో స్త్రీకి ఆర్థిక భద్రతకై నగలు, ఆస్తులు ఇచ్చే ఆచారం ఉండేది. క్రమంగా అవి వరకట్నంగా మారి, స్త్రీల పాలిటి కాలసర్పాలు అయ్యాయి. కొన్ని ఆచారాలు అర్థం లేనివయ్యాయి. పెళ్ళి అయిన స్త్రీకి పుట్టింటివారు "ఒడి బియ్యం" పోసే ఆచారం ఉండేది. అది నేడు పోయింది.

అలాగే కొన్ని మతాచారాలు, అనాచారంగానో, దురాచారంగానో మారుతున్నాయి.

**దేశంలో సంస్కరణోద్యమాలు :**

19వ శతాబ్దంలో భారతీయులలో స్వాతంత్ర్య వాంఛ కలగడానికి ముందె సాంప్రదాయిక సమాజాన్ని సంస్కరించాలన్న కోరిక కల్గింది. తరువాత జాతీయోద్యమం బలపడింది. 1890 నుండి సంస్కరణ ఉద్యమం, స్వాతంత్ర్య ఉద్యమం సమాంతరంగా సాగాయి.

సంఘంలో విప్లవాత్మక మార్పుల్ని ప్రవేశపెట్టాలనే కోరిక, బెంగాల్లో 19వ శతాబ్ది ప్రారంభంలోనే కలిగింది. రామ్ మోహన్‌రాయ్ ప్రారంభించిన సంఘ సంస్కరణ కార్యక్రమాలు, అందుకు దోహదం చేశాయి. సాంస్కృతికోద్యమంలో బ్రహ్మ సమాజం ముఖ్యపాత్ర వహించింది.

ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావం చేత ఎందరో మధ్య తరగతి మేధావులు, సంఘసంస్కరణ ఉద్యమాలకు అవసరమైన దృష్టినీ, సామాజిక పునాదినీ కల్పించారు. కందుకూరి, ముదు నరసింహం, వీరాస్వామి, గురజాడ వేంకటరత్నంనాయుడు, చిలకమర్తి వంటివారు ఈ కోవకు చెందుతారు.

వీరేశలింగం గారూ వారి అనుయాయులూ, తమ రచనల ద్వారా ఉపన్యాసాల ద్వారా మధ్య తరగతి కుటుంబాలను దురాచారాల నుండి దూరం చేయడంలో సాఫల్యం చెందారు. సంఘ సంస్కర్తల కృషివల్ల బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలు తగ్గాయి.

19వ శతాబ్దం చివరలో ప్రారంభమైన ఉద్యమాలు, ఆంధ్రులపై తమ ప్రభావాన్ని చూపాయి. సంస్కరణలు చేపట్టడానికి సంఘాలు స్థాపించబడ్డాయి. రామస్వామి చౌదరిగారు వివాహ రంగంలో గొప్ప సంస్కరణను ప్రవేశపెట్టారు. బ్రాహ్మణ పౌరోహిత్యం లేకుండా, వందలాంది పెళ్ళిళ్ళు జరిగాయి.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. విదేశాలలో స్థిరపడిన తెలుగువాళ్ళ తమ సంస్కృతిని ఎలా కాపాడుకుంటున్నారు?**

జ. నేడు తెలుగువాళ్ళు ఉద్యోగరీత్యా వ్యాపారరీత్యా విదేశాలకు ఎక్కువగా వలస వెడుతున్నారు. ఇలా వలస వెళ్ళినవారిలో మన ఆచారాలు, అలవాట్లు నరనరానా జీర్ణించుకొనిపోయాయి. వలస వెళ్ళినవారు అంతర్జాతీయ జీవన విధానంలో బ్రతుకుతున్నా వారి ప్రత్యేకతను లోకానికి చాటుతూనే ఉన్నారు.

ఆమెరికాలో "తానా', 'ఆటా, మారిషస్‌లో ఆంధ్ర మహాసభ వంటి భాషా సాంస్కృతిక సంస్థల ద్వారా వారు తమ ఆంధ్ర వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటున్నారు.

మనకు భాష, సంస్కృతిలో ఒక భాగం కాగా మారిషస్‌లోని తెలుగువారికి, భాషే సంస్కృతి. వారికి భాషే ఆచారం. వారిలో కుల స్పృహ లేదు. వాళ్ళందరిదీ ఒక్కటే కులం. అది తెలుగు కులం.

మారిషస్ తెలుగువారు, అమెరికా తెలుగువారు, వాళ్ళ రుచులు, అభిరుచులు మారకుండా జాగ్రత్త పడుతున్నారు.

వారు ఉగాది, దసరా వంటి పండుగల్లో కట్టుబొట్టుల్లో సాంప్రదాయక పద్ధతిని పాటిస్తూ వారు అందరూ కలసి వేడుకలు జరుపుకుంటారు.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. ఒడి బియ్యం ఆచారం దేనికి ప్రతీక ?**

జ. ఒడిలోని బియ్యం, "పునరుత్పత్తి శక్తికి ప్రతీక".

**2. 1890 నుండి ఏ ఉద్యమాలు సాగుతూ వచ్చాయి ?**

జ. 1890 నుండి సంస్కరణోద్యమం, స్వాతంత్ర్యోద్యమం సమాంతరంగా సాగుతూ వచ్చాయి.

**3. "స్నేహలత లేఖ" ఎవరి రచన ?**

జ. స్నేహలత లేఖ రాయప్రోలు సుబ్బారావు గారి రచన.

**4. తెలంగాణ వైతాళికులెవరు ?**

జ. మాడపాటి హనుమంతరావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు మొదలైనవారు, తెలంగాణ వైతాళికులు.

**5. తెలంగాణలో జరిగిన ఆర్థిక, సాంస్కృతిక పోరాటం ఏ స్థాయి నుండి ప్రారంభమైంది?**

జ. తెలంగాణలో జరిగిన ఆర్థిక సాంస్కృతిక పోరాటం ఉపరితలం నుంచి కాక అట్టడుగు స్థాయి నుండి ప్రారంభమైంది.

**6. 'ఆచారాలు - సంస్కరణలు" వ్యాస రచయిత ఎవరు ?**

జ. 'ఆచారాలు - సంస్కరణలు వ్యాస రచయిత డా॥ రావి భారతిగారు.

**7. రావి నారాయణరెడ్డి గారి ప్రత్యేకత ఏమిటి ?**

జ. రావి నారాయణరెడ్డిగారు, నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటంలో తలమానికంగా నిలిచారు.

**8. డా॥ రావి భారతిగారు అధ్యాపకురాలిగా ఎక్కడ పనిచేశారు ?**

జ. రావి భారతిగారు హైదరాబాదులోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి కళాశాలలో తెలుగు ఉపన్యాసకురాలిగా పనిచేశారు.

✲✲✲